సమస్యల సుడి..

- దీనావస్థలో రెల్లివీధి చేపల మార్కెట్
- ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- జీవీఎంసీ అధికారులూ స్పందించడం లేదు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు



శిథిలావస్థకు చేరిన చేపల మార్కెట్

జీవీఎంసీ 37వ వార్డు పరిధి రెల్లివీధిలో గల శ్రీపోలమాంబ చేపల మార్కెట్ సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. మౌలిక సదుపాయాలు లేక ఇక్కడి చేపల విక్రయదారులు సతమతమవుతున్నారు. ప్రజాప్రతినిధులు.. జీవీఎంసీ అధికారుల చుట్టూ తిరిగినా స్పందించే నాథుడే కరవయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు పరిధి రెల్లివీధి పోలమాంబ చేపల మార్కెట్‌కు రెల్లివీధి, కోడిపం డ్యాలవీధి, జబ్బరతోట, పెయిందొరపేట తదితర ప్రాంతాల ప్రజలు చేపలు, రొయ్యలు, పీతలు వంటి మత్స్యసంపద కొనుగోలుకు వస్తుంటారు. ఈ చేపల మార్కెట్లో మౌలిక సదుపాయాలు లేక ఇటు విక్రయదాలు.. అటు కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. చేపల మార్కెట్‌కు షెడ్డు ఉన్నప్పటికీ ఏ పాటి వర్షం కురిసినా చేపల బజారంతా వరదమయమే. ఇదిలా ఉండగా అక్కడి గచ్చును టైల్స్‌తో అద్దడంతో చిన్నపాటి వర్షానికే మార్కెట్ అంతా బురదమయమవుతోంది. గత ఏడాది ఓ మహిళ చేపల కొనుగోలుకు వచ్చి బురదగా ఉన్న గచ్చుపై జారిపడింది. తలకు తీవ్ర గాయమైన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని అక్కడి జాలర్లు.. చేపల విక్రయదారులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ దుర్వాసన వెదజల్లుతుండడంతో లోపలికి వెళ్లలేక బయటే కొనుగోలు చేసి వెళ్లిపోతున్నారు.



సమస్యలమయంగా మారిన రెల్లివీధి చేపల మార్కెట్

మార్కెట్లో దొంగతనాలు..

చేపల మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌కు అటు.. ఇటుగా ఉన్న గేట్లు రెండూ మూలకు చేరడంతో రాత్రి వేళల్లో చిల్లరదొంగలు విలువైన చేపలు దొంగిలిస్తున్నారు. ఇటీవల సుమారు రూ.15 నుంచి రూ.20 వేల విలువ చేసే చేపలను చిల్లర దొంగలు దొంగిలించినట్టు అక్కడి చేపల విక్రయదారులు బోరుమంటున్నారు. తరచూ జరుగుతున్న దొంగతనాలపై ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడం లేదని లబోదిబోమంటున్నారు. వార్డు కార్పొరేటర్ నుంచి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని, చివరకు జీవీఎంసీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపాటి గాలి వీచినా, వర్షం వచ్చినా ఆ చెట్టు కొమ్మలు షెడ్డుపై పడుతుండడంతో రేకులు విరిగిపడుతున్నాయని, పలుమార్లు సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మార్కెట్‌ను శుభ్రపరిచే వారు లేక మేమే శుభ్రం చేసుకుంటున్నామని వారు సాక్షికి తెలిపారు.

మా గోడు ఎవరు వింటారు?



మా గోడు వినేవారు లేరు. గత కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిలువ నీడ లేని పరిస్థితిలో ఉన్నాం. ఏ పాటి వర్షం వచ్చినా శ్లాబ్‌పై వర్షపు నీరు నిలిచిపోవడంతో నీరు కారి.. పెచ్చులూడుతున్నాయి. మార్కెట్‌కు ఉన్న గేట్లు మూలకు చేరాయి. ఇటీవల కాలంలో చేపల దొంగతనం ఎక్కువైంది. ఈ విషయమై పలుమార్లు రాజకీయనాయకులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎవరూ స్పందించలేదు.

సత్యవమ్మ, చేపల వ్యాపారి

మార్కెట్ శిథిలావస్థకు చేరింది..

మార్కెట్ షెడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడి పాడయ్యాయి. గేట్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్లో దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. ఏపాటి వర్షం కురిసినా మార్కెట్ అంతా బురదమయమవుతోంది. చేపలు కొనుగోలు చేసే వారు ఆ బురదలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు.

కొర్లమ్మ, చేపల వ్యాపారి

గంగా పుష్కరాల్లో వివేకానంద సంస్థ సేవలు



త్రివేణి సంగమం వద్ద అన్నదానం చేస్తున్న స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: విశాఖ మహానగరంలోనే కాదు.. గంగా పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమం వద్ద మూడు రోజుల పాటు పాత నగరానికి చెందిన స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు నిర్వహిస్తోంది. గత మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఎంతో మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. గంగా పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమానికి వచ్చే భక్తులకు నారాయణ సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ గంగా పుష్కరాలు, ప్రయాగ పుణ్యక్షేత్రానికి విచ్చేసే భక్తులకు మూడు రోజుల పాటు రోజుకి వేలాది మంది భక్తులకు అన్నదానం చేయాలని సంకల్పించామన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు కూడా నారాయణ సేవలు అందించాలన్న సంకల్పంతో ఈ మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), మట్టపల్లి హనుమంతరావు, రైటర్స్ అకాడమీ ప్రతినిధి వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకులు కేసనపల్లి నరసింగరావు, డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. సేవా కార్యక్రమంలో సంస్థ గౌరవ సభ్యుడు గజపతిస్వామి, సభ్యులు పి. నల్లరాజు, వి. దానయ్య, వి. తాతబ్బాయి, సీహెచ్ అప్పారావు, పి. నూకాలమ్మ, ఎస్. శ్రీరామ్ పాల్గొంటున్నారని తెలిపారు.

కల నెరవేరిన వేళ



పట్టాల పంపిణీలో మాట్లాడుతున్న దుర్గమాంబ సమాజానికి చెందిన మహిళా లబ్ధిదారు

జగదాంబ: దుర్గమాంబ సమాజంలో 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న 175 కుటుంబాల ప్రజల కల నెరవేరిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పట్టాల పంపిణీలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం కనీసం స్పందించకున్నా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందరికి ఇళ్ల పట్టాలు ఇస్తుందన్నారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు చొరవతో ఇంత తొందరగా పట్టాల పంపిణీ కార్యరూపం దాల్చిందన్నారు. అయితే ఇందులో 122 మందికి పట్టాలు వచ్చాయని మిగిలిన 53 మందికి ఇంటి యాజమానులు మృతి చెందిన కారణంగా వారసత్వ పట్టాలు తయారు చేస్తున్నారన్నారు. వాటిని కూడా తొందరలోనే అందజేస్తామన్నారు. లబ్ధిదారులందరికి పట్టాతో పాటు కన్వెన్స్ డీడీ కూడా అందజేస్తామన్నారు. ఏ వార్డులో లేనంతగా 35వ వార్డులో రూ.14.75 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, దుర్గమాంబ సేవాసంఘం సభ్యులు గౌరీశంకర్, దుర్గాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మల్లిబాబు, కండిపల్లి వరలక్ష్మి, గాజుల ప్రసాద్, దుర్గాప్రసాద్, గుజ్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కళ్లు దానం



సోదరుడు వెంకట రుద్రమాజీ అంత్యక్రియలు నిర్వహిస్తున్న సోదరి మంగ



ఐ బ్యాంకు అధికారులకు కళ్లు దానం చేస్తున్న రుద్రమాజీ చెల్లెళ్లు

అల్లిపురం: శేష జీవితం ప్రశాంతంగా గడుపుదామన్న వ్యకిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఆ వ్యక్తి చనిపోయి మరో ఇద్దరికి చూపును ప్రసాదించిన ఘటన అల్లిపురంలోని వెంకటేశ్వరమెట్టపై చోటు చేసుకుంది. సూరిశెట్టి వెంకట రుద్రమాజీ (62) కెనరా బ్యాంక్‌లో పనిచేసి రెండేళ్ల క్రితం రిటైరయ్యారు. మంగళవారం సాయంత్రం స్నేహితుడిని కలిసేందుకు గోపాలపట్నం వెళ్లారు. అక్కడ రోడ్డు దాటుతుండగా రాత్రి 9.20 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతుడు రుద్రమాజీకి పెళ్లి కాలేదు. అతనికి ఆరుగురు చెల్లెళ్లు. వైద్యుల సూచన మేరకు అతని కళ్లు దానం ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దీంతో మోహిసిన్ ఐ బ్యాంకుకు కళ్లు అప్పగించారు. అనంతరం అతని చెల్లెలు మంగ అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టి అన్న రుణం తీర్చుకుంది.

ఎట్టకేలకు తెరచుకున్న కేజీహెచ్ గేటు

- ఊపిరి పీల్చుకున్న రోగులు, బంధువులు, వైద్యులు, వాహన చోదకులు



తెరచుకున్న కేజీహెచ్ ప్రధాన గేటు

మహారాణిపేట : కేజీహెచ్‌కు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం ఎట్టకేలకు తెరచుకుంది. ఇన్‌గేట్ పునర్నిర్మాణానికి మొత్తం గేటును కొన్నాళ్ల కిందట మూసేసిన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షిలో ఈనెల 14న ‘ప్రవేశానికి పాట్లు’ శీర్షికన వార్త ప్రచురితమైంది. మంగళవారం కేజీహెచ్‌లో ఆధునాతన సత్రం ప్రారంభించడానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని రావడంతో గేటు తెరుచుకుంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే రోగులు, వారి బంధువులు, వైద్యులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కమ్యూనిటీ భవనం ప్రారంభం



దుర్గమాంబ సమాజంలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ సమాజంలో కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. దక్షిణ నియోజకవర్గంలోని ఒక్క 35వ వార్డులోనే కోట్ల రూపాయిల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనాన్ని అందరూ ఉపయోగించుకుని పరిశుభ్రంగా చూసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం రూ. 15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జెడ్సీ శివప్రసాద్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుడి తరలింపు



మానసిక వికలాంగుడిని వైద్యశాలకు తరలిస్తున్న మమత, రెడ్‌క్రాస్ సిబ్బంది

అల్లిపురం: మిండి గ్రామంలో ఒక మానసిక వికలాంగుడు నిస్సహాయ స్థితిలో ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమత, రెడ్‌క్రాస్ చైర్మన్ రవికుమార్ రెస్క్యూ టీం సహకారంతో అతన్ని చినవాల్తేరు మానసిక వైద్యశాలలో చేర్పించారు. అతని సుమారు 25 సంవత్సరాలు ఉండవచ్చని, అతని పేరు, వివరాలు తెలియజేయలేకపోతున్నాడని తెలిపారు. అతను కోలుకున్న తరువాత అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

అనాథ శవానికి దహన సంస్కారాలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేపడుతున్న మమత

అల్లిపురం: టీబీ ఆస్పత్రిలో గుర్తు తెలియని అనాథ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు ఆస్పత్రి వర్గాలు తెలియజేయటంతో ఆమె హాస్పటల్‌కు చేరుకుని ఆ వ్యక్తి మృతదేహాన్ని చావులమదుం శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

మహోన్నత వ్యక్తి భానోజీరావు



భానోజీరావు వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

దాబాగార్డెన్స్: మహోన్నత వ్యక్తి అంకిత వెంకట భానోజీరావని పలువురు వక్తలు కొనియాడారు. ఏవీ భానోజీరావు 45వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఏవీఎన్ కళాశాల ఆవరణలో గల ఆయన విగ్రహానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోనూ, ప్రజాప్రాతినిధ్యంలోనూ, సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో భానోజీరావు పేరొందారన్నారు. విశాఖ నుంచి శాసన సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించి విశాఖపట్నాన్ని శాశ్వత అభివృద్ధి వైపు నడిపించారన్నారు. విజయవాడలో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీని విశాఖపట్నం తరలించేందుకు తమ సొంత భూములు దానం చేసిన వితరణశీలిగా పేర్కొన్నారు. కళాశాల డీన్ శంకరనారాయణ మాట్లాడుతూ కేజీహెచ్‌కు తమ సొంత భూములు కేటాయించడంతో పాటు భవనాల నిర్మాణానికి సహకారం అందించారని, తాటిపూడి జలాలను విశాఖపట్నం తరలించాలన్న ఆలోచన కూడా ఆయనదేనన్నారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ నెలకొల్పడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేగా, మున్సిపల్ చైర్మన్‌గా శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నగరాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మంగమ్మ, పైడి రజని, వివిధ విభాగాల అధ్యాపకులు కృష్ణకుమారి, శ్రీనివాస్, సంతోషి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అల్లిపురం: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మహారాణిపేట పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాలిపేటకు చెందిన నాయిని రఘు (19) పూర్ణా మార్కెట్ దరి హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం విధులకు హాజరైన అతను మధ్యాహ్నం 1 గంటకు భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అతని తండ్రి, తల్లి, అక్క పనులపై బయటికి వెళ్లారు. సాయంత్రం 6.45 గంటల సమయంలో మృతుని అక్క సునీత ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయకపోవటంతో చుట్టుపక్కల వారి సహకారంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. గదిలో ఫ్యాన్ హుక్‌కు రఘు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో మృతుని తల్లిదండ్రులకు, మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు. తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతికి కారణం తెలియాల్సి ఉందని తెలిపారు.

ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు



సువర్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

విశాఖ విద్య: జీవీఎంసీ నుంచి పాఠశాల విద్యలో విలీనమైన ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు అందేలా తనవంతు కృషి చేస్తానని అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె. సువర్ణ అన్నారు. ప్రైమరీ స్కూళ్లలోని ఉపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆమెను పీఆర్‌టీయూ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలసి అభినందనలు తెలిపారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దామోదర్, కౌన్సిలర్ కనకరాజు ఆధ్వర్యంలో సువర్ణకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. సువర్ణ మాట్లాడుతూ ఒకే గొడుగు కిందకు పాఠశాల విద్య, మున్సిపల్ విద్య వచ్చినందున ఉపాధ్యాయులంతా కలసి విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలపై పీఆర్‌టీయూ నాయకులు ఆమె దృష్టికి తీసుకురాగా, తన పరిధిలోని వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి లలితాంబ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, జిల్లా కార్యదర్శి రవి, కరుణాకర్, విజయబాబు, స్వామి, సరస్వతి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వద్దాది రాజు కుటుంబానికి సాధిక్ పరామర్శ



వద్దాది రాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వద్దాది రాజు కుటుంబాన్ని కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ బుధవారం పరామర్శించారు. రాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి సహాయం కావాలన్నా ఒక సోదరుడి మాదిరిగా అండగా ఉంటానని సాధిక్ హామీ ఇచ్చారు.

60 ఏళ్లు దాటిన డీఎస్సీ-98 అభ్యర్థుల ధర్నా



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

ఆరిలోవ: డీఎస్సీ–1998లో క్వాలిఫై అయి 60 సంవత్సరాలు దాటిన వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 1998లో క్వాలిఫై అయిన తర్వాత ఇంత వరకు ఖాళీగా ఉన్నామని, ఇప్పుడు 60 సంవత్సరాలు దాటిపోవడంతో అర్హులుగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 60 ఏళ్లు దాటిన క్వాలిఫైడ్ అభ్యర్థులు 40 మంది ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో అభ్యర్థులు బి.సత్యనారాయణ, బి.వెంకటరమణ, టి.రామకృష్ణ, పి.ధర్మారాజు, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో షడావరణ అర్చన



లలితాపీఠంలో అర్చనలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సీతంపేట: వైశాఖ శుద్ధ షష్టి సందర్భంగా లలితా పీఠంలో సుబ్రహ్మణ్యస్వామికి షడావరణ అర్చన, హోమం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. పుత్రార్థి, ధనార్థి, వివాహార్థి, సుఖజీవనం, కుజదోష పరిహారం కోసం సుబ్రహ్మణ్యస్వామికి అర్చన, హోమం చేయడం వల్ల సత్ఫలితాలు లభిస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

కథలు సమాజ ప్రతిబింబాలు



మాట్లాడుతున్న రచయిత ఎల్ఆర్ స్వామి

సీతంపేట: కథలు సమాజ వాస్తవికతకు ప్రతిబింబాలని ప్రముఖ కథా రచయిత ఎల్.ఆర్.స్వామి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కథా కచేరీలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. చక్కటి శైలి, శిల్పంతో జనరంజకంగా రచనలు చేయాలన్నారు. సాహిత్యం వల్ల మనశ్శాంతి, పరివర్తన కలుగుతాయన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవులు, రచయితలు సాహిత్యాన్ని, తెలుగు భాషను, సమాజ వాస్తవికతను లోకానికి అందించే మార్గదర్శకులన్నారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సాహిత్య సంస్థలు చురుగ్గా పని చేయాలని, కవులు, రచయితలకు మంచి వేదికగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, రచయితలు యాళ్ల రాజేష్, కేవీఎస్ మూర్తి, కొత్తూరి రమణ, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు, వేదుల కామేశ్వరశర్మ, బి.రాధారాణి తదితరులు కథలు చదివి వినిపించారు.

క్విజ్ పోటీల విజేతలు వీరే..

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక నిర్వహించిన క్విజ్ పోటీల విజేతల వివరాలను సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీలో సీనియర్ విభాగంలో మొదటి బహుమతికి బి.మణినాగేంద్రరావు, రెండో బహుమతికి శేఖరమంత్రి ప్రభాకర్, దుర్గాప్రసన్న, మరడాన సుబ్బారావు ఎంపికైనట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో బి.వి.రామకృష్ణ, పి.సురేష్‌కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందారని తెలియజేశారు. విజేతలకు ఈ నెల 30న అంకోసాలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నాటక రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార: రంగసాయి నాటక గ్రంథాలయం 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని గ్రంథాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన వేడుకల్లో నాటక రచయితలు, నటులు, దర్శకులు పాల్గొన్నారు. వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పీటీ మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతిరావు, రాని వెంకటేశ్వరరావును రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ రాజా కృష్ణమూర్తి, వీవీ రమణమూర్తి సత్కరించారు. నట, దర్శకుడు పి.శివప్రసాద్ పర్యవేక్షణలో బాల నటులు సుమంత్, నవనీత్ కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారు. నవ చైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ‘అలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం’ హాస్య ప్రహసనాన్ని చిన్నారెడ్డి, పోతురాజు పద్మ ప్రదర్శించారు. పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో నారాయణ కళాశాల యాజమాన్యం

సీతమ్మధార : ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. హర్షవర్ధన్, దినకర్ నాయుడు, లవకుమార్, రాజేష్‌కు 465 చొప్పున మార్కులు వచ్చాయి. వై.ధనుంజయ జూనియర్ బైపీసీలో 440కి 431 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ ఫలితాల్లో వెయ్యికి 986 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో సంస్థ డీన్ జి.రామలింగేశ్వరరావు, డీజీఎం హనుమంతరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.